అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 03 జులై 2023

మల్టీపర్పస్ వర్కర్‌లకు పెంచిన వేతనాలు అందించాలి

• ఎంపీవో బ్రహ్మం ఆదేశం

నవతెలంగాణ-పిట్లం

గ్రామపంచాయతీలలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు పెంచిన వేతనాలను అందించాలని ఎంపిఓ బ్రహ్మం ఆదివారము ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ జీవో 39 ప్రకారం పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు అదనముగా ఒక వెయ్యి రూపాయలను చెల్లించాలని ప్రభుత్వము సూచించినట్లు తెలిపారు. పెంచిన వేతనాలు మే నెల నుండి వర్తిస్తాయని పాత వేతనాలతో కలిపి ప్రభుత్వ జీవో ప్రకారం పెంచిన ఒక వెయ్యి రూపాయలను కలిపి చెల్లించాలని ఆయా పంచాయతీలకు సూచించారు.

పోడుభూమి లబ్దిదారులకు పట్టాలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కామారెడ్డి నియోజకవర్గ గ్రామాలైన గొడుగుమర్రి తాండ, జగదాంబ తండా, రెడ్డి పెట్ గ్రామపంచాయతీ పరిధిలోని 55 మంది పోడు భూమి లబ్దదారులకు 76 ఎకరాల 32 గంటల భూమికి సంబంధించిన పట్టాలను లబ్దిదారులకు ఆదివారం కామారెడ్డిలో ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ రెడ్డి మాట్లాడుతూ.. పోడు భూమి పట్టాదారులకు పేద బడుగు బలహీన వర్గాల లబ్ధిదారులను ఆదుకోవాలని ఉద్దేశంతో కెసిఆర్ ప్రభుత్వం పట్టాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజుబుద్దిన్, ఎంపీపీ దశరథ్ రెడ్డి, సర్పంచులు రాజు నాయక్, శ్రవంత పరమేష్, అమృత బాలరాజు, ఎంపీటీసీలు చంద్రకళ గంగారెడ్డి, సత్యాలి చంద్రు నాయక్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీలతో వరినాట్లు

నాడు ఉపాధి కరువు..
నేడు ఉపాధి కల్పిస్తున్న రైతులు

• ఇతర రాష్ట్రాల వ్యవసాయ కూలీలకు ఏటేటా పెరుగుతున్న డిమాండ్
• కూలీల కొరత తీరిందంటున్న రైతులు
• నెల రోజుల పాటు ఇక్కడే మకాం



నసురుల్లాబాద్‌లో నాట్లు వేస్తున్న మహిళలు, పురుషులు



సాలూర మండలంలో నాట్లు వేస్తున్న బీహార్ కూలీలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కొత్త ఒక వింత.. పాత ఒక రోత.. ప్రస్తుతం సాగు విధానంలో కొత్త విధానం వింతతో పాటు లాభాలను తెచ్చిపెడుతోంది. గతంలో ఉపాధి లేక కూలీ పనులకు వెళ్లిన రైతులే.. ప్రస్తుతం వలస కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. స్థానికంగా వరి నాట్లు వేసే సమయంలో కూలీల డిమాండ్ నెలకొనడంతో ప్రతేసారీ రైతులకు ఇబ్బందులు కలిగేవి. ప్రస్తుతం ఆ సమస్యను వలస కార్మికులతో పూడ్చుకుంటున్నారు. బీహార్, పశ్చిమ్‌బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి వస్తున్న కూలీలతో వరి నాట్లు వేస్తున్నారు. దీంతో వరి నాట్లు జోరందుకున్నాయి.

స్థానికంగా మహిళా కూలీలు మాత్రమే వరినాట్లను వేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన మగ కూలీలు సైతం నాట్లు వేస్తుండటంతో ఏటికేడు వరి నాట్లకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వరినారును చేతబట్టి చకచకా వరినాట్లు వేస్తున్న విధానం ఈ ప్రాంత రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు. పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ కూలీలు వేస్తున్న వరినాట్లు దిగుబడులు పెంచుతుండడంతో వారితో వరినాట్లు వేయించుకునేందుకే రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏటేటా ఇతర రాష్ట్రం నుంచి బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వరినాట్లు వేసేందుకు వస్తున్న కూలీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. నసురుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్, దుర్కి, అంకోల్ క్యాంప్, నాచుపల్లి, రైతునగర్ తిమ్మాపూర్, బీర్కూర్ తదితర గ్రామాల్లో ఉత్తరరాది రాష్ట్రాల వలస కూలీలు వచ్చి వరి నాట్లు వేస్తున్నారు. నెల రోజుల్లో ఇక్కడ వరి నాట్లు పూర్తి చేసి తిరుగు ప్రయాణం అవుతారు.

గత కొన్ని సంవత్సరాలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో భూగర్భజలాలు అనూహ్యంగా పెరిగాయి. ఫలితంగా మెట్ట రైతులు సైతం తమ భూకమతాలను వరి మాగాణులుగా మార్చుకున్నారు. దీంతో స్థానికంగా నాట్లు వేసేందుకు కూలీల కొరత భారీగా ఏర్పడింది. దీనికి తోడు కొత్త తరం యువతి, యువకులు నాట్లు వేసేందుకు ఇష్టపడడం లేదు. క్రమంగా ఏటా నాటేసే వారి నైపుణ్యం తగ్గి పోతున్నది. ఇందుకు రైతులు ప్రత్యామ్నాయ మర్గాల అన్వేషణలో భాగంగా ఇతర రాష్ట్రాల కూలీల ఆగమనం ప్రారంభమైంది. ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా నుంచి మగ కూలీలు వచ్చి రైతులకు కూలీల కొరత తీరుస్తున్నారు. ఇప్పుడు వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి కూడా ఇతర రాష్ట్రాల కూలీలు తరలి వచ్చారు. అయితే గతానికి భిన్నంగా వేలాది మంది స్థానిక రైతుల పంట క్షేత్రాలకు పోటెత్తారు. గతంలో కేవలం మగ కూలీలే వచ్చేవారు. ఇసారి మహిళలు సైతం నాట్లేసేందుకు వచ్చారు. గతంలో మండలానికి రెండు మూడు బ్యాచ్‌లు మాత్రమే రాగా, ఇసారి ప్రతి గ్రామానికి రెండు మూడు బృందాలు నాటేసేందుకు తరలి వచ్చాయి. దాదాపు ప్రతి గ్రామంలో సగం వరకు నాట్లు మొత్తం వలస కూలీలే పూర్తి చేస్తున్నారు. దీంతో స్థానిక కూలీలపై పెద్ద ఎత్తున్న ఒత్తిడి తగ్గుతున్నది.

రైతులకు ఊరట..

రైతులు వ్యవసాయ కూలీల కొరతను ఎదుర్కొంటున్నారు. వలస కూలీలు రావడంతో రైతులకు కొంత ఊరట కలుగుతుంది. ఒకటి కూలీల కొరత తీరడంతో పాటు, పెట్టుబడి కూడా తగ్గుతుంది. ఇక్కడి కూలీలతో వరినాట్లు వేయిస్తే ఎకరాకు రూ.5 వేలు ఖర్చు కాగా, అక్కడి కూలీలతో వరినాట్లు వేయిస్తే ఎకరాకు రూ.4 వేలు అవుతుంది. ఎకరానికి 10 కేజీల వరి విత్తనాలు సరిపోతుంది. మన ప్రాంత కూలీలు వేస్తే 30 కేజీల విత్తనాలు అవసరం పడుతుంది.

సూర్యోదయానికి ముందే..

వరి నాట్లు వేసేందుకు వలస కూలీలు రోజూ సూర్యోదయం కంటే ముందే పంట పొలాల్లోకి దిగుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సమయంలో సాధ్యమైనంత ఎక్కువ సమయం వరి పొలంలోనే గడిపి ఎక్కువ డబ్బులు సంపాదించుకొని వెళ్లాలనే ఆతృత వలస కూలీల్లో కనిపిస్తున్నది. వలస కూలీలు తమ వంటలను సైతం పొలాల వద్దే తయారు చేసుకుంటున్నారు. వీరిని పంట క్షేత్రాలకు తీసుకొచ్చే ఆసాములే వారికి గ్యాస్‌తో పాటు ఇతర వంట సామగ్రి సమకూర్చుతున్నారు. కూలీల్లో ఒకరిద్దరు వంట పనులు చూసుకుంటున్నారు. సమయానికి వంట పూర్తి కాగానే పొలం గట్లపైనే తిండి కానిచ్చేస్తున్నారు. స్థానిక కూలీలు ఎకరాకు పది నుంచి పన్నెండు మంది నాట్లు వేస్తే వీరు మాత్రం ముగ్గురు, నలుగురే పూర్తిచేస్తున్నారు. దీంతో కూలీల ఖర్చు తగ్గుతుండడంతో రైతులు వీరివైపే మొగ్గు చూపుతున్నారు.

వరినాట్లు వేయడానికి బీహార్ కూలీలు

బోధన్ : వ్యవసాయ రంగం రోజు రోజుకు ఎన్ని మార్పులకు లోనైనా, యాంత్రికరణ జరిగినా వరి నాట్లు మాత్రం కూలీలతోనే వేయిస్తున్నారు. గతంలో స్థానిక మహిళ కూలీలతోనే వ్యవసాయం పనులు ముమ్మరంగా చేయించిన, ప్రస్తుతం కూలీల కొరతతో సాగు పనులకు కూలీలు దొరకడం లేదు. దాంతో రైతులు మహారాష్ట్ర నుండి మహిళ కూలీలను రప్పిస్తూ వరి నాట్లు ముమ్మరంగా వేయిస్తున్నారు. అలాగే బీహార్ రాష్ట్రానికి చెందిన పురుషులు 10 నుంచి 15 మంది చొప్పున బృందాలుగా విడిపోయి జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. ఎకరానికి 4000/- రూపాయలు తీసుకుంటూ రోజుకు 6 నుంచి 10 ఎకరాల వరకు బీహార్ కూలీలు వరి నాట్లు వేస్తున్నారని రైతులు తెలిపారు. వ్యవసాయంలో యాంత్రికరణ ఎంత జరిగిన కూలీలచే వరి నాట్లు వేయిస్తుండడంతో వారికి చేతి నిండా పని దొరికినట్లు అయింది.

బీడీ కార్మికుల మెడకు
దేశాయి బీడీ స్నాక్స్ ప్యాకెట్లు

• వాటిని కొంటేనే ఆకు, తంబాకు వేస్తామని వేధింపు
• యాజమాన్యంపై కార్మికుల గుర్రు • వెయ్యి బీడీలకు రూ.9 కోత
• కేంద్ర ఆంక్షలతో ఇప్పటికే ఉపాధిపై ప్రభావం
• నెలలో 10 రోజులైనా పని దొరకని స్థితి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



కేంద్ర ప్రభుత్వం బీడీ రంగంపై విధిస్తున్న ఆంక్షలతో ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న బీడీ కార్మికులను.. కొన్ని యజమాన్యాలు మరింత ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. ముఖ్యంగా దేశాయి బీడీ కంపెనీ.. కార్మికులతో బలవంతంగా 'స్నాక్స్' ప్యాకేట్లు కొనాలని ఒత్తిడి చేస్తోంది. నిజామాబాద్, కామారెడ్డితో పాటు సిద్ధిపేట, జగిత్యాల, సిరిసిల్ల, చేర్యాల్, బచ్చన్నపేట తదితర కేంద్రాల్లో కార్మికులపై ఒత్తిడి చేస్తోంది. నేరుగా యజమాన్యం తలదూర్చకుండా కమిషన్ ఏజెంట్లతో కార్మికులతో బలవంతంగా కొనుగోలు, అమ్మకం చేయిస్తున్నారు. ప్రతినెలా రూ.250-రూ.350 విలువ గల స్నాక్స్ ప్యాకేట్లు కొనాలని షరతు విధించారు. ఇక వెయ్యి బీడీలకు రూ.9 కోత విధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం బీడీరంగంపై విధిస్తున్న ఇబ్బడిముబ్బడి ఆంక్షలతో కార్మికులకు ఉపాధి పూర్తిగా దూరమయ్యింది. గతంలో నెలలో 24 రోజుల పాటు ఉపాధి లభించగా.. ఇప్పుడు కేవలం 10 రోజులు కూడా సరిగ్గా పని దొరకడం లేదు. నాన్ పీఎఫ్(వర్ధి) బీడీలు చేయిస్తూ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారు.

వివరాలు మెయిన్‌లో..

విద్యారంగ పరిరక్షణకు
ఐక్య విద్యార్థి ఉద్యమాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



జెండా ఆవిష్కరణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు విద్యార్థులందరూ ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, నాగరాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరిట విద్యార్థుల్లో విద్వేషాలు నాటుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండి పడ్డారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రెండు రోజుల రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందించను న్నారు.

వివరాలు మెయిన్‌లో..

రిటైర్డ్ జవాన్‌కు ఘనస్వాగతం

• పూలమాలతో సన్మానం



బైక్ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, స్నేహితులు

నవతెలంగాణ-లింగంపేట్

19 సంవత్సరాలు పాటు ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందిన ఆర్మీ జవాన్‌కు లింగంపేట మండల కేంద్రంలో చెందిన చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అప్పటి పదవ తరగతి స్నేహితులు యువకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. అనంతరం 2002 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు చిన్ననాటి మిత్రులు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగంపేట మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన సిహెచ్ శంకర్ 19 సంవత్సరాల పాటు ఆర్మీ జవాన్ గా విధులు నిర్వహించారు. దేశానికి సేవలు అందించారు. పదవి విరమణ పొంది స్వగ్రామానికి వస్తున్న సందర్భంగా కోమటిపల్లి గ్రామస్తులు తోటి స్నేహితులు చిన్ననాటి మిత్రులు యువకులు విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీని నిర్వహించారు. అడుగడుగునా ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్ మాట్లాడుతూ 19 సంవత్సరాలు దేశం కోసం ఎనలేని సేవ చేశానన్నారు. కష్టసుఖాలను స్నేహితులతో పంచుకున్నారు. ఆర్మీలో చేరడం నా అదృష్టం అన్నారు. ప్రతి ఒక్కరు దేశం కోసం తన వంతు బాధ్యతగా సేవ చేయాలని తపన ఉండాలన్నారు. దేశభక్తి పాటలతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. ఆర్మీ జవాన్‌కు పూలదండలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయిని అశోక్, గుండ బాలకిషన్, శ్రీకాంత్, నవీన్, సుదర్శన్, కాశీరాం, రంజిత్ రెడ్డి, బన్సీలాల్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఎంసెట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సర్టిఫికేట్‌లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఇంజినీ రింగ్ ప్రవేశాల కోసం ఎంసెట్ రాసిన విద్యార్థులకు కౌన్సెలింగ్ కొనసాగు తోంది. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న 410 మంది విద్యార్థులు సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ పూర్త యినట్టు నిజామాబాద్ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త శ్రీరామ్ కుమార్ తెలిపారు. ధృవపత్రాల పరిశీలన 6 వరకు కొనసాగుతుందని, ధృవపత్రాల పరిశీలన పూర్తి అయిన విద్యార్థులు జులై 8 వరకు కళాశాలల ఎంపిక తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మరింత సమాచారం కోసం వెబ్ సైట్ https://tseamcet.nic.in ని సంప్రదించాలని కోరారు.

విదేశీ విద్యానిధి పథకం..
ఉన్నత చదువులకు భరోసా

• పేద విద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు అవకాశం
• వినియోగించుకోవాలని అధికారుల సూచన



నవతెలంగాణ-ఏర్గట్ల

ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులు.. విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునేందుకు విద్యానిధి పథకం భరోసా నిస్తుంది. విదేశాల్లో ఆయా కోర్సుల్లో చదువుకోవాలనే ఆసక్తి గల విద్యార్థులకు ఈ పథకం కింద రూ.20 లక్షల రుణాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది. రుణంతో పాటు వీసా, విమాన టికెట్ సైతం విద్యార్థులకు అందనుంది. ఇందుకోసం లబ్ధిదారులైన విద్యార్థి కుటుంబ ఆదాయం సంవత్సరానికి 5 లక్షలు మాత్రమే ఉండాలి. కుటుంబంలో ఒక్కరు మాత్రమే లబ్దిపొందే అవకాశం ఉంది.

లబ్దిపొందే విద్యార్థి వయస్సు దరఖాస్తు చేసుకునే నాటికి 35 ఏళ్ళు దాటొద్దు. డిగ్రీలో 60 శాతం మార్కులు సాధించాలి. ఇందుకోసం జీ ఆ ర్ ఈ, జీమాట్, టోఫెల్, ఇంగ్లీష్ టెస్ట్‌లో అర్హత సాధిం చాల్సి ఉంటుంది. విద్యార్థులు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా లాంటి పది దేశాల్లో మాస్టర్స్, పీజీ, పి.హెచ్.డి చదవడానికి ఇదో సువర్ణావకాశం.

విద్యార్థులు వినియోగించుకోవాలి

సంక్షేమ వసతిగృహ అధికారి రాము



విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడానికై ప్రభుత్వం అవకాశం కల్పిస్తున్న "విదేశీ విద్యానిధి" పథకాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి. ఈ పథకం ఎస్సి, ఎస్టీలకు అంబేద్కర్ పేరిట, బీసీలకు జ్యోతిభా పూలే, మైనార్టీలకు సీఎం ఓవర్సీస్, బ్రాహ్మణులకు వివేకానంద పేరిట అందుబాటులో ఉంది. వివరాలకు ఆన్‌లైన్‌లో 'తెలంగాణ ఈ పాస్' వెబ్‌సైట్‌ను సందర్శించారు. ఈ పథకాన్ని 2016 లో రాష్ట్రప్రభుత్వం ఉనికిలోకి తెచ్చింది.

గిరిజనుల సంక్షేమానికి కృషి

• అభివృద్ధి పనులు చేపట్టడంతో తండాల్లో మార్పు
• పోడు పట్టాల పంపిణీలో విప్ గంప గోవర్ధన్
• అటవీ సంపద కాపాడేది గిరిజనులే : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



పట్టాలు అందజేస్తున్న విప్ గంపగోవర్ధన్


గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని కెవిఆర్ గార్డెన్ లో ఆదివారం గిరిజనులకు పోడు భూముల పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పోడు పట్టాలను గిరిజనులకు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం లభించిందన్నారు. తండాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల తండాలో మార్పు కనిపిస్తుందని చెప్పారు. సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. వందల ఏళ్లగా గిరిజనులు అటవీ సంపదను కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. ప్రభుత్వం అర్హత గల గిరిజనులకు పోడు భూములను పంపిణీ చేసిందని చెప్పారు. గిరిజనులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా మార్చాలని కోరారు. ఈ సందర్భంగా 668 మంది లబ్దిదారులకు 1668 ఎకరాలు పోడు భూమి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దిన్, ఎంపీపీ నర్సింగ్ రావు, జెడ్పిటిసి సభ్యుడు రామ్ రెడ్డి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల గిరిజనులు పాల్గొన్నారు.

పలు రైలు సర్వీసులు రద్దు

• 3 నుంచి 9వ తేదీ వరకు అమలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల నిర్వహణ పనుల్లో భాగంగా నిజామాబాద్‌కు సంబంధించిన పలు రైల్వే సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే శాఖ రద్దు చేసింది. ఈ నెల మూడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగనుంది.

రద్దు చేసిన రైళ్ల వివరాలు

కరీంనగర్ టు నిజామాబాద్	(07894)	(3.07.23-9.7.23)
నిజామాబాద్ టు కరీంనగర్	(07893)	(4.7.23-10.7.23)
కాచిగూడ -నిజామాబాద్	(07596)	(3.7.23-9.7.23)
నిజామాబాద్ -కాచిగూడ	(07593)	(3.7.23-9.7.23)
నిజామాబాద్- నాందేడ్	(07853)	(3.7.23-9.7.23)
నాందేడ్- నిజామాబాద్	(07854)	(2.7.23-8.7.23)

గుంతకల్ - బోధన్ రైల్వే సమయం మార్పు చేశారు.

దౌండ్ - నిజామాబాద్ రైలును ముద్ఖెడ్ నిజామాబాద్ వరకు 2 వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రద్దు చేశారు.

నవతెలంగాణ
నిజామాబాద్
2
సోమవారం 03 జులై 2023

వైద్యునికి సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం తరుపున తిరుమల హాస్పిటల్ ఆర్థో వైద్యులు డా. అమర్ బాబును శనివారం రాత్రి సన్మానించారు. డాక్టర్ దివ్య భారతి, డాక్టర్ స్నేహ డాక్టర్ శ్రావణి, డాక్టర్ విజయ్(గుత్ప)కి జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం తరుపున డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గగ్గుపల్లి శ్యాం, మామిడిపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన చెట్టు.. తొలగించే వారి కరువు



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సాలంపాడ్ క్యాంప్ గ్రామం వద్దగల వైకుంఠధామం సమీపంలో ప్రధాన రోడ్డుపై చెట్టు పడిపోయి వాహనాలకు అడ్డంగా ఉంది. అయినా దానిని ఎవర పట్టించుకోవడం లేదు. దాంతో ఆ రహదారి వెంట రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్టును తక్షణమే గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అటవీ అధికారుల వేధింపులను అరికట్టాలి

- ఎమ్మెల్యే బాజిరెడ్డికి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా బృందం వినతి

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండల కేంద్రంలో గల సర్వేనెంబర్ 532లో పేదలు అనేక ఏళ్ళుగా పోరాడుతున్న పేదలపై అటవీ అధికారుల వేధింపులను అరికట్టాలని సిపిఐఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, సిరికొండ మండల కార్యదర్శి ఆర్. రమేష్, నాయకులు ఎం. సాయరెడ్డి, జి. కిషోర్, ఎర్రన్న ప్రతినిధుల బృందం నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవిన్యూ అధికారులు పట్టాలు ఇచ్చిన, హైకోర్టు పేదలదే భూమి అని తేల్చి చెప్పి అటవీ అధికారులు జోక్యం చేసుకోవద్దు అని తీర్పు ఇచ్చిన, అటవీఅధికారులు భూములను సాగుచేయకుండ అడ్డుకుంటున్నం దున్న సమస్య పరిష్కారానికి పూనుకోవాలని కోరారు. జాయింట్ రిజస్టర్ పై అటవీ అధికారులు సంతకం చేయకుండా, పేదల సాగుకు అడ్డు పడుతున్న అటవీ అధికారులను పిలిచి భూమి సమస్య పరిష్కారం చేయాలనీ ఎమ్మెల్యేకు వివరించారు. ఆయనను కలిసిన వారిలో ప్రజాపంథా నాయకులు ఆర్ రమేష్, ఎం.సాయరెడ్డి, కిషోర్, లబ్దిదారులు వున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- ఆర్టీసీ ఎండీ సజ్జనర్
- ఉత్తమ విద్యార్థులకు సన్మానం



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న సజ్జనార్

నవతెలంగాణ-ఆర్మూర్

క్షత్రియ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. శ్రీ సోమ వంశీయ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి/పట్కరి) ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ అధ్యక్షతన ఆదివారం సికింద్రాబాద్ లోని జీడిమెట్లలో గల ఎస్ఎస్‌కే సమాజ్ కమ్యూనిటీ హాల్ లో రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ ఖత్రి కులానికి చెందిన ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇన్స్పిరేషన్ ప్రోగ్రాం -2023 ద్వారా ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ, ఎంబీబీఎస్‌లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన స్టూడెంట్స్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హాజరై సహస్రార్జున చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సజ్జనార్ మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యం, కృషి ఉంటే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. సభకు అధ్యక్షత వహించిన క్షత్రియ ప్రాంతీయ సమాజ్ అధ్యక్షులు ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విశ్వనాథ్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ సమాజ్ సలహాదారులు, అఖిల భారత క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ బాలకిషన్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించాలన్నారు. ఆలిండియా క్షత్రియ సమాజ్ ఉపాధ్యక్షులు, క్షత్రియ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, అల్లాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్షత్రియ కమ్యూనిటీలోని ఉత్తమ విద్యార్థిని, విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. సమాజ్ కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న పలువురిని "సమాజ్ సేవా పురస్కార్" అందజేసి సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సమాజ్ అధ్యక్షులకు శాలువా మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టంకు విష్ణు, కార్యక్రమ కన్వీనర్ సిరిగిరి రాంకిషన్ రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ విశ్వనాథ్ అశోక్, పుజారి రాజేశ్వర్, మామిడి పెంటూసా, గుజరాతి రాజేశ్వర్, కోశాధికారి దినేష్ వైద్య, రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, కార్యదర్శులు డాక్టర్ ఆనంద్ మేగ్జి, సంతోష్ , రాజీవ్ నామాజి, భరత్ చవాన్, రతన్ నెహ్రూ, రాజ్ కుమార్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర మహిళా మండి అధ్యక్షురాలు డాక్టర్ ఎల్లమ్మ బాయి, ప్రధాన కార్యదర్శి దొండి మీనాక్షి, కోశాధికారి టంక్ కస్తూరి, క్షత్రియ ప్రాంతీయ యువ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ పండిత్, ప్రధాన కార్యదర్శి జమన్ జ్యోతి శ్రావణ్, కోశాధికారి విజయ్ బసుదే, ఆర్మూర్ సమాజ్ అధ్యక్షులు హజారీ మదన్ మోహన్, కార్యదర్శి బారాడ్ గంగామోహన్, సభ్యులు పాల్గొన్నారు.

చేపూర్‌లో వ్యక్తిపై దాడి

- తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో బేరి చంద్రశేఖర్ అనే వ్యక్తిపై ఐదుగురు వ్యక్తులు కలిసి ఆదివారం సీసాలు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ బోనాల సందర్భంగా పండుగ జరుపుకోవడం కోసం కల్లు సీసా తేవడానికి కళ్ళు దుకాణానికి వెళ్ళాడు. అక్కడ ఉన్న ఇద్దరు వక్తులు కల్లు సీసాలతో దాడి చేసి తలపై గాయపరిచారు. తిరిగి ఇంటి వద్ద మరో ముగ్గురు యువకులతో కలిసి వచ్చి కర్రలు, రాడ్లతో తలపై మెడ వీపు భాగాన తీవ్రంగా కొట్టి గాయపరిచారు. తీవ్ర గాయాలైన చంద్రశేఖర్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా తలకు 11 కుట్లు పడ్డాయి. బాధితుడు చంద్రశేఖర్ దాడి చేసిన ఐదుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామానికి చెందిన పులి జీవన్ అనే యువకుడు రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం పెద్దవాల్గోట్ నుండి చిన్నవాల్గోట్‌కు వచ్చే దారిలో కప్పల వాగు సమీపంలో ఒకే వైపు వస్తున్న కారు, బైక్‌కు తగలడంతో బైక్ పైనుండి పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీఆర్ఎస్‌లో చేరిన మచ్చర్ల గ్రామస్తులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన పలువురు యాదవ సంఘం సభ్యులు, పట్టణంలోని పి ఫ్రీ గల్లి మున్నూరు కాపు సంఘ సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో ఆదివారం చేరినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

అండగా ఉంటా.. ఆందోళన వద్దు

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- బాధిత కుటుంబానికి 50వేల ఆర్థిక సహాయం



ఆర్తికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కుటుంబానికి అండగా ఉంటానని ఎలాంటి ఆందోళన చేందవల్సిన అవసరం లేదని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలా మండల సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి మేనమామ షేక్ నబీసాబ్ అలియాస్ అక్బర్ హత్యకు గురైన విషయం తెలుసుకొని ఆదివారం బాధితున్ని ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనవంతుగా ఖర్చులకోసం 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గృహ లక్ష్మి పథకంలో డబుల్ బెడ్రూమ్ మంజూరు చేయిస్తామని, వితంతు పింఛన్‌ను అందించే విధంగా కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు.

రోడ్డు ప్రమాద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

ఇందల్ వాయి మండలంలోని వెంగల్ పాడ్ పాటి తండా గ్రామానికి చెందిన లవుడియ గోపి నాయక్, అదే గ్రామానికి చెందిన మలవత్ రెడ్డి ఇటీవల ఇద్దరు వేరు వేరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకొని ఆదివారం వారి ఇంటి వద్దకు వెళ్లికుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఆయనవెంట జిల్లా యువ నాయకులు, జిల్లా ఒలంపిక్ ఉపాధ్యక్షులు, ధర్పల్లి జెడ్పీటిసి బాజిరెడ్డి జగన్మోహన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, కార్యక్రమంలో బిఆర్ఎస్ ఇందల్ వాయి మండల అధ్యక్షులు చిలివేరి గంగాదాస్, ఎంపిటిసి చింతల దాస్, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, సీనియర్ నాయకులు పాశం కుమార్, మండల వైస్ ప్రెసిడెంట్ బీరిష్‌శెట్టి, మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఖాజా మియ, తదితరులు ఉన్నారు.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం

- ఆరోవారం కొనసాగిన స్వచ్ఛకాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం
- చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు తొలగింపు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు రెండు గంటలు శ్రమదానం చేసి కాలనీలో రోడ్లను, మురుగు కాలువలను శుభ్రం చేశారు. చీపుర్లతో రోడ్లపై చెత్తాచెదారం ఊడ్చేశారు. పారలు పట్టుకొని పిచ్చిమొక్కలు, ముళ్ళ చెట్లను తొలగించారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, రాళ్ళు రప్పలను, చెత్తా చెదారాన్ని తొలగించి, పూడిక తీసి మురుగు నీరు వెళ్ళిపోయేలా చేశారు. జర్నలిస్ట్ కాలనీని పరిశుభ్రంగా ఉంచడానికి గత ఆరు వారాలుగా ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, పురపాలక చైర్ పర్సన్ పండిత్ వినీత చేతుల మీదుగా స్వచ్ఛ కాలనీ అవార్డు అందుకున్నామని ఆయన పేర్కొన్నారు. అవార్డుకు కారకులైన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఘనపురం సంతోష్, కార్యదర్శులు కొంతం రాజు, లోచారం సాయన్న, కానిస్టేబుల్ ప్రసాద్, ప్రదీప్, ఎల్ టీ కుమార్, సదమస్తుల గణపతి, బాస మోహన్, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

881 మంది లబ్దిదారులకు పోడుపట్టాలు పంపిణీ



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని కేసుదాస్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే టి ఎస్ ఆర్ టి సి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఎస్టీలకు పోడుపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ... కేంద్రం కేసీఆర్‌తో జగడాలు పెట్టుకుంటున్నా, గిరిజనులకు అటవీ భూముల హక్కుల కోసం పోరాడి, పోడు పట్టాలు సాధించి పెట్టారని గుర్తు చేశారు. ప్రతిపక్షాలు ప్రజలకు ఏం చేస్తాయో చెప్పవని, వాళ్లకు సీఎం పదవి ముఖ్యమని అన్నారు. కేసీఆర్ ఇస్తున్న పథకాలకు అదనంగా మేము ఎక్కువిస్తామని చెప్పే దమ్ము లేదుకానీ, అడ్డమైన విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సిరికొండ ప్రజలు 30 సంవత్సరాల నుండి ఆదరిస్తున్నారని, ఆశీర్వాదం వల్ల, సర్పంచ్ నుండి ఎమ్మెల్యే వరకు ఎదిగానని ఆయన గుర్తు చేశారు. సిరికొండ ప్రాంతంలో చాలావరకు గిరిజన ప్రజలే ఎక్కువగా ఉన్నారని అన్నారు. కానీ కొంతమంది బంజారా యువకులు బిజెపి పార్టీకి భజన చేస్తున్నారని, బిజెపి పార్టీ వల్ల ప్రజలకు జరిగేది నష్టమే తప్ప లాభం లేదదని, రిజర్వేషన్స్ ఉండవు, సంక్షేమ పథకాలు అసలే వద్దంటారని అన్నారు. గిరిజన సోదరుల కోసం రిజర్వేషన్ 12 శాతం కావాలని కేంద్రానికి పంపితే నరేంద్ర మోడీ ముడ్డి కింద పెట్టుకొని, రిజర్వేషన్ ఇవ్వలేదు కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల కోసం బంజారాహిల్స్ లో బంజారా భవన్ నిర్మించారని, 10 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీత రాజేందర్ , జెడ్పీటీసీ మాలావత్ మాన్ సింగ్, జిల్లా రైతు బంధు అధ్యక్షులు మంజుల , మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఆకుల తిరుమల్, యూత్ అధ్యక్షులు చిగురు శ్రీనివాస్, సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ఆదాయాన్ని అందరికీ సక్రమంగా ఇవ్వాలి

భవాని కల్లు సహకార సొసైటీ సభ్యులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వచ్చిన ఆదాయాన్ని అందరికీ సరైన పద్ధతి లో పంచాలి అని భవాని కల్లు సహకార సొసైటీ సభ్యులు అన్నారు. మూడో కల్లు డిపో సంఘం సభ్యులతో హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీహరి ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లు డిపోలో కొన్ని సంవత్సరాలుగా సొసైటీ సభ్యులకు సక్రమమైన పంపకాలు జరగడం లేదని, వచ్చిన ఆదాయాన్ని అందరికీ సరైన పద్ధతిలో పంచాలి అని ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. వచ్చిన ఆదాయంలో ప్రజాప్రతినిధులకు ఇవ్వడం జరుగుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో భూమ గంగాధర్, తిరుమలెష్ గౌడ్, శంకర్ గౌడ్, అశోక్ గౌడ్, రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయం సరికాదు

- కాంగ్రెస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షులు రవి



మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షులు రవి

నవతెలంగాణ-మోపాల్

మాజీ ఎమ్మెల్సీ భూపతి రెడ్డి, ముప్ప గంగా రెడ్డి కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులుగా తమను తొలగించి మరో వ్యక్తిని నియమించే ఏక పక్ష నిర్ణయం సరైంది కాదని మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గున్నే రవి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను ఏమీ తప్పు చేశానని చెప్పకుండా పదవి నుండి తొలగించడం సరికాదన్నారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి లు మండల కమిటీని ఎన్నుకోవాలని లేకపోతే రాబోయే రోజుల్లో పార్టీకి నష్టం జరుగుతుందిన అన్నారు. నూతన అధ్యక్షులు కనీసం 50 మందిని కూడ సభ్యత్వం చేయించలేదని, తామేంటో ప్రజలందరికీ తెలుసు అని అన్నారు. ఎవరికి టికెట్టు వచ్చినా.. ఎవరు ఎమ్మెల్యే అయినా పార్టీ కోసం పని చేస్తామన్నారు. మండలానికి రేవంత్ రెడ్డి వచ్చిన సమయంలో ఎంతో కష్టపడి కార్యకర్తలతో పెద్ద ఎత్తున తను జన సమీకరణ చేశానని తెలిపారు. మండల్‌లో రూరల్ కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని అనుకున్నామని, కానీ గ్రూపు రాజకీయాల వల్ల మండలంలో పార్టీకి మనుగడ లేకుండా పోతుందని తెలిపారు. నిజామాబాద్ రూరల్ లో అన్ని మండల్ లోకెల్లా మొపాల్ చాలా ధృఢంగా ఉందని, అటువంటి పార్టీని ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం ఇబ్బందికి గురి చేయడం బాధాకరమని అన్నారు. తాను బతికున్నన్నిరోజులు కాంగ్రెస్ పార్టీతోనే ఉంటానని, రూరల్ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడతానని కచ్చితంగా మండల్‌లో అత్యధిక మెజార్టీ తేవడానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలో అనేకమంది కాంగ్రెస్ కార్యకర్తలకు మనోభావాలు దెబ్బతింటున్నాయని, మేము కాంగ్రెస్ కార్యకర్తలం కాదని.. కాంగ్రెస్ పార్టీ సైనికులమని.. పార్టీ కోసం ఎంత త్యాగానికైనా సిద్ధపడతామని.. కుటుంబం కంటే పార్టీ ముఖ్యమని అంతగా సేవ చేస్తామని ఆయన అన్నారు. ఇప్పటికైనా మండలంలో పార్టీని ఒకే తాటిపై తీసుకురావాలని తెలిపారు. మండల వైస్ ప్రెసిడెంట్ సాయికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి ఎంత త్యాగానికైనా సిద్ధమని.. పదవులు ముఖ్యం కాదని.. పార్టీ అధికారంలోకి రావడమే ముఖ్యమని.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మనుగడ ఉంటుందని లేకపోతే రాష్ట్ర మొత్తం అప్పుల తెలంగాణగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎం పి టి సీ రఘు, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

7న ఆర్డీవో కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తొమ్మిది నెలల నుండి బకాయి ఉన్న పెండింగ్ బిల్లులు ప్రభుత్వం ఇవ్వకపోవడం చాలా బాధాకరం అని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు.చక్రపాణి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశము ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ఈనెల 7న ఆర్డీవో కార్యాలయం ముందు టోకెన్ సమ్మె 10 నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో 8 కోట్లకు పైగా బకాయిలు కూరక పోయాయని తెలిపారు. జిల్లాలో చాలామంది వంట మానేశారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని పట్టించుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటియుసి జిల్లా నాయకులు పి.సుధాకర్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ, గంగాధర్, ఉమా, స్రవంతి, బాలరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖాన, శ్మశాన వాటిక, ప్రహరీ నిర్మాణానికి

నిధులు మంజూరు చేస్తా

- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లిలో ముస్లింల షాదీఖానా నిర్మాణానికి 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేస్తానని, శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు కు కృషి చేస్తానని ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధ్ అన్నారు. ఆదివారం బాధిత కుటుంబాలకు పరామర్శించాడానికి వచ్చిన సందర్భంగా ముస్లిం కమిటీ ప్రతినిధులు మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్ అధ్వర్యంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ ఇందల్ వాయి మండల కేంద్రంలో ముస్లింల జానభా ఎక్కువగా ఉందని, వివాహలు, ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి షాదిఖాన లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, గత్యంతరం లేక నిజామాబాద్ కు వెళ్ళి పెండ్లిలు శుభకార్యాలు చేసుకుంటున్నామని వారన్నారు. శ్మశానవాటిక చుట్టూరా ప్రహరీ గోడ లేక సమాదుల్లో డ్రైనేజీ నీరు చేరి ఇబ్బందికరంగా మారుతుందని ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నిధులను మంజూరు చేయాలని వారు కోరారు. స్పందించిన ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ షాదిఖాన నిర్మాణానికి తనవంతుగా 10లక్షలు త్వరలో మంజూరు చేస్తానని, శ్మశాన వాటిక, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధుల మంజూరు కు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ముస్లిం ప్రతినిధులు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు, ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ ఇందల్ వాయి మండల అధ్యక్షులు చిలివేరి గంగాదాస్, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, షేక్ కరీం, ఖాజా భాయ్, షేక్ సద్దాం, అహ్మద్, అన్వర్ ఖురేషి, మైనార్టీ యూత్ అధ్యక్షులు ఇమ్రాన్ ఖురేషి, బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు బీరిష్ శెట్టి, సీనియర్ నాయకులు పాశం కుమార్, కుమ్మరి శ్రీను, గ్రామ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, డైరెక్టర్ బొక్క గంగాధర్, సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మౌలా, షేక్ అఫ్రోజ్, షేక్ మున్నా, చెక్ పావర్ ఎర్రోళ్ల సాయన్న,అసాది సాయిలు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్ళ రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంతా ఒకే చోటుకు చేరిన పూర్వవిద్యార్థులు

నవతెలంగాణ
కామారెడ్డి
3
సోమవారం 03 జులై 2023

30 పడకల ఆస్పత్రికోసం పోరాడుదాం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి కోసం పోరాడుదామని యువజన నాయకుడు బాలుయాదవ్ కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మద్నూర్ మండలానికి ఏమీ రాలేదని, వచ్చిన 30 పడకల ఆస్పత్రి సైతం 15 పడకల ఆస్పత్రిగా మారిందని అన్నారు. పాలకులను ప్రశ్నించకుండా ఉంటే ఉన్న ఆస్పత్రి కూడా తరలిపోయే అవకాశం ఉందని ఆరోపించారు. కావున 30 పడకల ఆస్పత్రి కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలు యాదవ్, మద్నూర్ యువకులు నవీన్ యాదవ్, విఠల్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధుల ద్వారానే గ్రామాల అభివృద్ధి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధుల ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని బిజెపి విస్తారక్ కేరళ రాష్ట్ర అధికార ప్రతినిధి సుమతి అన్నారు. ఆదివారం మండలంలోని కాటేపల్లి తండాలో స్థానిక బిజెపి నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి నిధులు ఇవ్వడం ద్వారానే పల్లెలు బాగుపడ్డాయి అనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. మోడీ పాలనలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

ప్రతిభకు పేదరికం అడ్డంకి..

- తండ్రి మెడికల్ కాలేజీలో సెక్యూరిటీ గార్డు.. కొడుకుకు ఎంబీబీఎస్ సీటు
- నీట్‌లో జాతీయస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థి సిద్ధార్థ్
- చదువుకు లక్షల్లో ఖర్చుతో వెనుకడుగు
- ఆర్థిక సహకారం కోసం పేద దళిత తల్లిదండ్రుల ఆవేదన
- ప్రభుత్వ పెద్దలు స్పందించి డిఎంఎఫ్‌టీ నిధులకు వేడుకోలు





నీట్‌లో జాతీయస్థాయిలో ర్యాంక్ సాధించడంతో సిద్ధార్థ్‌కు సన్మానం

నవతెలంగాణ-నవీపేట్

ఆర్థికంగా పేద విద్యార్థి.. కానీ చదువులో సరస్వతి పుత్రుడు. విద్యాభ్యాసం అంతా గురుకులాల్లో సాగింది. డాక్టర్ కావాలనే కలతో నీట్ ఎంట్రెన్స్ రాయగా.. జాతీయ స్థాయిలో మంచి ర్యాంక్‌తో ప్రతిభ కనబరిచాడు. అయితే ఎంబీబీఎస్ చదువు లక్షల ఖర్చుతో కూడుకున్నది కావడంతో తన చదువుకు పేదరికం అడ్డుగా వస్తుంది. దాతలు, ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రోత్సాహమిస్తే డాక్టర్ అయి పేదలకు వైద్య సేవలందిస్తానని పేర్కొంటున్నాడు.

నిజామాబాద్‌లోని మెడికల్ కాలేజీలో తొమ్మిది సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న నవీపేట్ మండల కేంద్రానికి చెందిన దర్శనాల గంగాధర్ పెద్ద కుమారుడు సిద్ధార్థ్ 2023 నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందుతున్నాడు. వైద్య వృత్తిపై మక్కువతో తను చదువుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కరీంనగర్ జిల్లా అల్గనూరు ద్వారా నీట్ కోచింగ్‌కు ఎంపికై రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ పొంది 2023 నీట్ పోటీ పరీక్షలో జాతీయస్థాయిలో 404 మార్కులతో 17,296 ర్యాంకు సాధించాడు. మంచి ర్యాం కు సంపాదించడంతో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో కార్యదర్శి, ఐఏఎస్ రోనాల్డ్ రాస్ సిద్ధార్థ్ ను ప్రత్యే కంగా సన్మానించారు.

చదువం తా గురుకులంలోనే..

సిద్ధార్థ్‌ది దళిత పేద కుటుంబం కావడం తండ్రి గంగాధర్ 9 ఏళ్లుగా నిజామాబాద్ మెడికల్ కళాశాలలో కేవలం ఎనిమిది వేల జీతానికి సెక్యూరిటీ గార్డ్ గా పనిచేయడం తల్లి అన్నపూర్ణ స్థానిక ఆదర్శ పాఠశాల వసతి గృహంలో రోజు వారి కూలీగా పనిచేస్తుంది. గతంలో ప్రభుత్వం తరఫున స్థానిక లింగమయ్య గుట్టలో ప్లాటు లభించడంతో అప్పుచేసి ఇల్లు నిర్మించు కొని జీవిస్తున్నారు. సిద్ధార్థ నాలుగవ తరగతి వరకు స్థానిక లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో చదువుకోగా ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రస్తుత కామరెడ్డి జిల్లా బిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు నుండి పదవ తరగతి వరకు చదివి కరీంనగర్ జిల్లా అల్గనూరు సాంఘిక సంక్షేమ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి నీట్ పోటీ పరీక్షలో ర్యాంకు సంపాదించాడు.



మెడికల్ కాలేజీలో సెక్యూరిటీగా పని చేస్తున్న తండ్రి గంగాధర్

సంబర పడాల్సిన సమయంలో..

ఎంబిబిఎస్ లో సీటు సంపాదించేందుకు జాతీయస్థాయిలో తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ మంచి ర్యాంకు సాధించిన సిద్ధార్థ్ ఉన్నత చదువులకు పేదరికం అడ్డు వస్తుందన్న ఆలోచనతో సంబర పడాల్సిన సమయంలో అందరితో సంతోషాన్ని పంచుకోలేని పరిస్థితిలో కుటుంబం ఆవేదన చెందుతుంది. ఐదేళ్లలో కనీసం పది లక్షలకు పైగా ఖర్చు అవుతుందని తెలిసి వెనుకడుగు వేస్తున్నారు. తమ కుమారుడి చదువుకు గొప్ప మనసుతో సహకారం అందించాలని సిద్ధార్థ్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ద్వారా డిఎంఎఫ్‌టీ నిధులపై వేడుకోలు

వైద్య వృత్తి లక్ష్యంగా రాత్రింబవళ్లు చదువుకుని ఎంబీబీఎస్ సీటు సాధించిన సిద్ధార్థ్‌కు ప్రభుత్వం తరఫున డిఎంఎఫ్‌టి నిధులతో ప్రభుత్వ పెద్దలు మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ సహకరించి దళిత సామాజిక వర్గానికి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. ఎంబిబిఎస్ కళాశాలలో కౌన్సెలింగ్ జూలై రెండో వారంలో ఉంటుండడంతో ఆలోపు పేద దళిత బిడ్డ ఉన్నత చదువులకు సహకరించి మంచి భవిష్యత్తుకు పునాదివేయాలని ఆశిస్తున్నారు.

కార్డియాలజిస్ట్‌గా సేవలు అందించాలనే ఆలోచన : సిద్ధార్థ్

వైద్య వృత్తిపై ఎంతో ఇష్టంతో కష్టపడి ప్రభుత్వ విద్య అందిస్తున్న సహకారం వలన ఎంబీబీఎస్ సీటు సంపాదించాను. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధులతో ఆకస్మిక మరణాలు చెంది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కాబట్టి ఎంబిబిఎస్ పూర్తి చేసి కార్డియాలజిస్ట్ గా పేద ప్రజలకు సేవలందిం చాలనే ఆలోచన ఉంది.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు ఆహ్వానం



విప్‌ను ఆహ్వానిస్తున్న రజకసంఘం నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణకు ఈ నెల 7 వ తేదీన ముఖ్య అతిథిగా హాజరు కావాలని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌ను రజక సంఘం నాయకులు కోరారు. ఆదివారం కామారెడ్డిలోని విప్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, సీడీసి చైర్మన్ నర్సయ్య, నాయకులు శ్రీనివాస్, రజక సంఘము సభ్యులు ఎల్లయ్యా, కపిల్, నర్సయ్య, రామ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ నిధులతో బోరు బావి తవ్వకం



బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఆదివారం 1,50,000లతో బోర్ వేయించినట్లు మండల బి.ఆర్. యస్ అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో బోరు వేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సంకరి.లక్ష్మీ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడ్ల నర్సింలు, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు మర్రి సదాశివరెడ్డి, ఎంయంసి డైరెక్టర్ ఆకుల సిద్ది రాములు, నాయకులు పైడి జనార్దన్, గంగా రాజం, శేకెల్లి రాజయ్యా ఆకుల విఠల్, కుమ్మరి రాజయ్య, కుమ్మరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు.. ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 1998 సంవత్సరంలో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి ఒకచోట కలుసుకొని తమ పూర్వజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఉన్నారు.

అధ్వానంగా రోడ్డు

నందివాడ, పోతాయిపల్లిరోడ్డు పూర్తిగా ధ్వంసం

- పదేండ్లుగా పట్టించుకోని పాలకులు, అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

రాష్ట్రంలోని అన్ని రోడ్లను బాగు చేస్తున్నాం, మెరుగైన రోడ్లను ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెప్పినా.. ఆచరణలో మాత్రం అమలు పరచడం లేదు. తాడ్వాయి మండలం నందివాడ, పోతాయిపల్లి రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉంది. గత పది సంవత్సరాల నుంచి రోడ్డు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలోని నందివాడ, పోతాయిపల్లి పిర్యయకుంట తండా కన్నాపూర్, పోల్కంపేట్ గ్రామస్తులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

బురదమయం అవుతున్న రోడ్డు

వర్షాకాలంలో కొద్దిపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. లింగంపేట్ మండలం కన్నాపూర్, పోతాయిపల్లి, కోమటిపల్లి పోల్కంపేట గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల ప్రజలు కామారెడ్డి పట్టణానికి చేరుకోవాలంటే ఈ రోడ్డు మార్గం సులువుగా ఉంటుంది. ఈ రోడ్డు మార్గం ద్వారా కామారెడ్డి జిల్లా కేంద్రానికి దూరం తక్కువ అవుతుంది. ఈ గ్రామాల ప్రజలు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో చుట్టూ తిరిగి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు



అధ్వాన్నంగా మారిన రోడ్డు

అడవిలో ఆగిన రోడ్డు పనులు

తాడ్వాయి-లింగంపేట్ మండలాల సరిహద్దు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నారు. పనులు నిలిచిపోయి పది సంవత్సరాలు దాటినా పట్టించుకున్న పాపాన పోలేదు. అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

రాజకీయాలకతీతంగా సంఘాన్ని అభివృద్ధి చేస్తాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మహాలక్ష్మి పద్మశాలి సంఘం 46వ తర్ప నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఆ సంఘ భవనంలో అట్టహాసంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొండ గంగాచరణ్‌తో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ యాదగిరి హాజరై మాట్లాడుతూ నూతన కార్యవర్గం బంధుప్రీతి, రాజకీయాలకతీతంగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. మహాలక్ష్మి పద్మశాలి సంఘానికి జిల్లా పద్మశాలి సంఘం పక్షాన అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు..జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, కోశాధికారి గుడ్ల భూమేశ్వర్,పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్, మహాలక్ష్మి పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి క్యాతం గంగాధర్, కోశాధికారి చాట్ల రవీందర్, ఉపాధ్యక్షులు బత్తుల అశోక్, బిల్ల నారాయణ,బెల్దె సుదర్శన్, సహాయ కార్యదర్శి ఇంజమూరి మధు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

పలుగ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ

- ఘనంగా ఆషాడ మాస బోనాలు

భిక్కనూర్: భిక్కనూరు పట్టణంలో శ్రీ క్రిష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆషాడ మాస బోనాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు బోనాలు ఊరేగింపు నిర్వహించి మహంకాళి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యాన్ని, తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని రాంపూర్, కంబాపూర్ గ్రామాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఆషాడ మాసం నేపథ్యంలో కట్ట మైసమ్మ , గ్రామ దేవతలకు , దుర్గ మాత ఆలయాలకు పెద్ద ఎత్తున మహిళలు బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి రామారావు చెరువు వద్దగల కట్ట మైసమ్మ గుడి , కుర్తి గేట్ వద్దగల దుర్గామాత అమ్మవారల వద్దకు చేరుకొని నైవేద్యాన్ని సమర్పిం చారు. అనంతరం గ్రామల ప్రజలు వనభోజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు మందడి నారాయణరెడ్డి , ఎంపీటీసీ మందడి సునీత, ఉప సర్పంచులు , వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు,



మద్నూర్‌లో వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్



భిక్కనూర్‌లో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

బోనాల పండుగ సందడి

మద్నూర్: మద్నూర్ మండల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం గ్రామ ప్రజలు నల్ల పోచమ్మ, మత్తడి పోచమ్మ బోనాల పండుగలను ఘనంగా నిర్వహించుకున్నారు. బేడల వారీగా బోనాలు నైవేద్యాలతో వైభవంగా పండుగ చేసుకున్నారు. సర్పంచ్ సురేష్, గ్రామ కార్యదర్శి సందీప్ నల్ల పోచమ్మ మత్తడి పోచమ్మ బోనాల పండుగను దృష్టిలో పెట్టుకొని ఆలయాల పరిసరాలను శుభ్రం చేయించి ఏర్పాట్లు చేయించారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో గ్రామ ప్రజలు ఈ పండుగలను నిర్వహిస్తుంటారు.

నిరుపేదలకు మాజీ ఎంపీపీ విశేష సేవలు

- వర్ధంతి పురస్కరించుకొని నివాళి.. పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మాజీ ఎంపీపీ బీమాగౌడ్ జీవితాంతం నిరుపేదలు, మండల ప్రజలకు సేవలందించారని మార్కెట్ కమిటీ డైరక్టర్ ఫతియొద్దీన్ అన్నారు. మాజీ ఎంపీపీ తొలి వర్ధంతి పురస్కరించుకొని ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు ఆదివారం నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని జీవదాన్ వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యల పట్ల దృష్టి సారించి ప్రజలకు సమస్యలు రాకుండ అందుబాటులో ఎల్లప్పుడూ ఉంటూ సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపిగౌడ్, ఇమామ్, విష్ణు, ఖయ్యుమ్, ఖాజాపాషా, వసిమ్ రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోతాయిపల్లిలో వన భోజనాలు



అటవీ ప్రాంతంలో వనభోజనాలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు. ప్రతి సంవత్సరం మాదిరిగా జూలై మొదటి వారంలో వన భోజనాలకు తరలివెళ్లారు. సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వన భోజనానికి వెళ్లారు. అనంతరం కుటుంబ సభ్యులతో భోజనాలు చేశారు. ఆటపాటలతో సందడి చేశారు.

పలువురికి సేవా పురస్కారాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండలానికి చెందిన పలువురు ముదిరాజ్ కులస్తులు సేవా పురస్కారాలు అందుకున్నారు. మండల కేంద్రానికి చెందిన రాజారాం నాగరాజుతో పాటు, నిజ్జన రమేశ్ పండుగ సాయన్న సేవా పురస్కారాలను అందుకున్నట్టు నాయకులు తెలిపారు. హైదరాబాద్‌లో వీరు సేవా పురస్కారాలు అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

2003-04 ఎంవి రామయ్య హై స్కూల్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. తోటి మిత్రులు నవీన్, సుదీర్ ఇటీవల మృతిచెందడంతో వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో ఇటీవల కాలంలో ఆటో డ్రైవర్ రాజమల్లు అనారోగ్య కారణంగా మరణించిన విషయం తెలిసిందే. దీంతో చిన్ననాటి స్నేహితులు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. రూ.27 వేలు పోగు చేసి కుటుంబీకులకు ఆదివారం అందజేశారు. తోటి మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఇందూరు తిరుమలను దర్శించుకున్న బలగం మూవీ డైరెక్టర్

నవతెలంగాణ -మోపాల్

మోపాల్ మండలం నర్సింగపల్లి ఇందూరు తిరుమల క్షేత్రాన్ని బలగం దర్శకులు ఎల్దండి వేణు ఆదివారం దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బలగం వేణుతో పాటు ఆలయ ధర్మకర్త ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి, రవిందర్ యాదవ్, నర్సారెడ్డి,నరాల సుధాకర్, గంగారెడ్డి, అర్చక స్వాములు సంపత్ కుమారాచార్య,, రోహిత్ కుమారాచార్య తదితరులు పాల్గొన్నారు.



కొటార్మూర్ విశ్వకర్మ నూతన అధ్యక్షునిగా శ్రీనివాస్ ఎన్నిక



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కొటార్మూర్ విశ్వకర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తంగళ్ళపల్లి శ్రీనివాస్, సెక్రటరీగా రాజన్న, ట్రెజరర్‌గా నరేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి నిర్విరామ కృషి చేస్తానని తెలిపారు.

4న ఆర్డీవో కార్యాలయం ముందు పెన్షనర్ల ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 4వ మంగళవారం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని అధ్యక్షులు సాయన్న, జిల్లా ఉపాధ్యక్షులు బాబా గౌడ్, కార్యదర్శి బొమ్మెన శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి తేదీనే పెన్షన్ చెల్లించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను పటిష్టపరిచి, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుమతించాలని, బకాయి పడ్డ డీఏలను విడుదల చేయాలని, పే రివిజన్ కమిటీని జులై 23 నుండి అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, రూ:398తో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తెలిపారు. ఈ ధర్నాలో అత్యధిక సంఖ్యలో ఆర్మూర్ డివిజన్లోని రిటైర్డ్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

వైశ్య లైమ్ లైట్ అవార్డు ప్రదానోత్సవం



అవార్డు అందుకుంటున్న పబ్బసాయిప్రసాద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వైశ్య లైమ్ లైట్ అవార్డ్స్ 2023 ప్రదానోత్సవ కార్యక్రమం జేఆర్సి కన్వెన్షన్ హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. మోస్ట్ పాపులర్ వైశ్య మెన్ కేటగిరీ లో ఆన్లైన్ ఓటింగ్ ద్వారా నిర్వహించిన సందర్భంగా పబ్బ సాయి ప్రసాద్ రెండు రాష్ట్రాల్లో 72 మంది పోటీలో ఉండగా 3 వ స్థానం లో నిలిచారు. ఈ అవార్డ్‌ను తెలంగాణలో ఆర్య వైశ్యుల ఏకైక ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, శాసన మండలి సభ్యులు బొగ్గరపు దయానంద్ గుప్త , తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, నిర్వాహకులు ఇమ్మడి శివ గారి చేతుల మీదుగా సాయిప్రసాద్ అందుకున్నారు.

అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రానికి ఐదు లక్షల నిధులు మంజూరైనట్టు డివిజన్ దళిత ఐక్య సంఘటన నాయకులు ఆదివారం తెలిపారు, దళిత ఐక్య సంఘటన నాయకులు జంగం అశోక్ కోటేశ్వర్, గుమ్మడి చంద్రయ్య, పింజ భూమేశ్వర్, ఎల్ టి కుమార్ తదితరులు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించి 5 లక్షలు మంజూరు చేసినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు .

స్థల పరిశీలన..

పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించేందుకు గాను గల స్థలాన్ని జర్నలిస్టు కాలనీలో ఆదివారం పరిశీలించారు కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, నాయకులు పండిత్ ప్రేమ్, సుంకరి రవి, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ మేరు సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సంఘం భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి విచ్చేసి సంఘ అధ్యక్షునిగా శ్రీ రాజుల దేవి రవినాథ్, ప్రధాన కార్యదర్శి దీకొండ లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు సంఘవి గంగాధర్, 18 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కలిసికట్టుగా ఉండాలని, మేరు కులాన్ని బీసీ (డి) నుండి బీసీ(ఏ)లో మార్చేందుకు సీఎం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్, కొత్తూరు గిరిరాజ్, మున్సిపల్ చైర్మన్ పండిత్ వినీత పవన్, మామిడిపల్లి మాజీ సర్పంచ్ రవి గౌడ్, జిల్లా మేరు సంఘ అధ్యక్షుడు సోమ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి దేవిదాస్, కోశాధికారి చంద్రకాంత్, పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు మంత్రి వేముల శుభాకాంక్షలు



లింబాద్రిని సన్మానిస్తున్న మంత్రి వేముల

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియామకమైన ప్రొఫెసర్ లింబాద్రి ఆదివారం రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మినిస్టర్ క్వార్టర్స్ లోని అధికార నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లింబాద్రిని మంత్రి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసిఆర్ లింబాద్రి మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ..ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు.

ఘనంగా బోనాలు

- జీజీహెచ్‌లో బోనాలు
- బోనమెత్తిన సూపరింటెండెంట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఏడాది ఆషాడమాసంలో నిర్వహించే బోనాలను ఈసారి కూడా ఘనంగా నిర్వహించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ బోనం ఎత్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ మెడికల్ కాలేజీలోని బంగారు మైసమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయంగా పండుగలను నిర్వహించి మన సంస్కృతిని కాపాడాలని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.



కంఠేశ్వర్: జీజీహెచ్‌లో బోనాల పండుగలో పాల్గొన్న సిబ్బంది



బోధన్:బోనాలతో వస్తున్న మహిళలు



ఆర్మూర్‌లో

గోవింద్‌పేట్‌లో పోచమ్మ పండగ వేడుకలు

ఆర్మూర్: మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో ఆదివారం వీడీసి ఆధ్వర్యంలో పోచమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండమీది గంగాధర్, ఎంపీటీసీ రాజకుమార్, సొసైటీ చైర్మన్ బంటు మైపాల్, వీడీసి అధ్యక్షులు లింగారెడ్డి, బండమీది సుభాష్, సాయిరెడ్డి, లింబాద్రి, గంగాధర్, మహేందర్ అప్పాల గణేష్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో బోనాల సందడి

బోధన్: ఆషాడ మాసం సందర్భంగా ఆదివారం బోధన పట్టణంలో పలు సంఘాల నాయకులు బోనాల పండుగను నిర్వహించారు. శ్రీ కృష్ణ యాదవ సంఘం పోస్ట్ ఆఫీస్ తర్ప, తట్టికోట దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆషాఢ మాస బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలు తీసుకునిరాగా, డప్పు సప్పుళ్లతో మహాలక్ష్మి దేవాలయానికి తరలివచ్చి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు గౌడి శివ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సింగం రమేష్, శ్యామల గంగాధర్, కోడె శేఖర్, మల్లేష్, నర్సన్న, సతీష్, రాజు కుమార స్వామి, రవి సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలతో అభివృద్ధిని ఆపలేరు

- బిజెపి, కాంగ్రెస్ ప్రజాసంక్షేమం మర్చిన పార్టీలే
- అన్ని వర్గాలకు మనసంక్షేమం కేసీఆర్‌తోనే
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

బాల్కొండ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తనపై చేస్తున్న ఆరోపణలతో అభివృద్ధిని ఆపలేరని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీంగల్, బాబాపూర్ ముచ్కూర్ గ్రామలకు చెందిన బిజెపి, కాంగ్రెస్‌కు చెందిన పలువురు మంత్రి సమక్షంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వాపును చూసి బలుపు అనుకొనే స్థితిలో ఉన్నారని, కర్ణాటక గెలుపుతో తెలంగాణలో బలోపేతం అయ్యిందని భ్రమపడుతన్నారని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధిని మేమే చేస్తున్నామని బిజెపి చెప్పుకుంటుందని తెలిపారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మోడీ ఎందుకు అమలు చేయలేకపోతున్నాడో ప్రజలు నిలదీయాలని కోరారు. బాలల్కొండలో అభివృద్ధి పరంపరను ఎవ్వరు ఆపలేరని, అంతకు రెట్టింపు అభివృద్ధిని చేసి చూయిస్తానని తెలిపారు. కర్నె సత్యగంగయ్య, మాసం మధు, సాయి, బాల కృష్ణ, అశోక్, 50 మంది కార్యకర్తలు చేరిన వారిలో ఉన్నారు. కార్యకమంలో డాక్టర్ మధేశేఖర్, రాజారాం యాదవ్, భీంగల్ మండల నాయకులు ఉన్నారు.



బీఆర్ఎస్ కండువా వేస్తున్న మంత్రి వేముల

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని రాజరాజేశ్వరినగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వేణుగోపాల్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ కండవాలను కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమిని అన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల నుండి బిజెపి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో త్వరలో చేరనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బొనగిరి భాస్కర్, నాయకులు వన్నెల రాజేశ్వర్, పడాల మల్లేష్, గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు పూచెట్టి నటరాజ్, గురువయ్య, పూచెట్టి సుబ్బయ్య, ముత్యం, దంత భూమేశ్వర్, కంచు పెద్ద మల్లేష్, చింతకుంట వంశీ, కళ్ళ దశరథ్, నడుకుడ సాయన్న, కుమ్మరి ఆనంద్, దంతే సాగర్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

న్యాయవాదులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించాలి

- మంత్రి వేములకు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్

న్యాయవాదుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు వందకోట్ల నిధిని కేటాయించిన మూలంగా వేలాదిమంది న్యాయ వాదులకు ఆరోగ్యబీమా పథకం అమలవుతున్నదని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి అధికారిక నివాసంలో ఆయనను కలిసి న్యాయ వాదులకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలుగా పలు సూచనలు వివరించారు. చాలామంది న్యాయవాదులు చాలా రకాల ఆర్థిక, సామాజిక, వృత్తి పరమైన సమస్యలను ఎదుర్కొంటు న్నారని తెలిపారు. వాటిని రూపుమాపడానికి ప్రభుత్వ పరిధిలో కొన్ని విధానపరమైన నిర్ణయాల అవసరాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ నిధి నుండి న్యాయవాదులకు మరణాంతర పరిహారం నాలుగు లక్షలు అందిస్తున్నారని, అనారోగ్యంతో బాధపడు తున్న వారికి, ఇతరత్రా గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో మరణాంతర పరిహారం 8 లక్షలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో 10 లక్షలు ఉన్నదని, కేరళ రాష్ట్రం 20 లక్షలకు పెంచబోతున్నదని తెలియజేస్తు ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా విధానపరమైన నిర్ణయం తీసుకునేటట్లు చొరవ చూపాలని మంత్రిని కోరారు. న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, స్వతహాగా న్యాయవాది అయిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డ్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ దృష్టికి, తద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయవాద సమాజానికి మేలు కలిగే విధానంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని అన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు..

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎంబిటి నాయకులు అధికార ప్రతినిధి సయ్యద్ అవేజ్, యూత్ ప్రెసిడెంట్ అబ్దుల్ వాసి, వైస్ ప్రెసి డెంట్ సుమీర్ లు కోలా వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు వీరికి నాయకులు సాయిబాబా గౌడ్, మాజీద్, మహమూద్ అలీ లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రం లో ముఖ్యమంత్రి కెసిఆర్ కేంద్రంలో బిజెపి మోడీ లను ఓడించే గల సత్తా శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉన్నాయి అని, రాహుల్ గాంధీ గారి భారత్ జోడో యాత్రతో స్ఫూర్తి పొంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు అని, ఆర్మూర్ నియోజకవర్గంలో ఈ చేరిక ప్రారంభం మాత్రమే అని రానున్న రోజుల్లో కింది స్థాయి నుండి పై స్థాయి వరకు భారీ చేరికలు ఉంటాయి అని అన్నారు, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న తాజా మాజీ ఎంపీటీసీలు, కౌన్సిలర్ సర్పంచ్‌లు టచ్‌లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ వదిలి వెళ్లినవారు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని అన్నారు. ప్రజలు మార్పు కోరుతున్నారని, కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. పార్టీలో చేరిన అవేజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు చేసిన అభివృద్ధికి ఆకర్శితుడినై పార్టీలో చేరాను అని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్ణం గంగాధర్, హబీబ్, మీసాల రవి, ఫయామ్,బట్టు శంకర్, ఉస్మాన్, బాలకిషన్, పాషా తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌పార్టీలో చేరిన ఎంబిటి నాయకులు

అభివృద్ధి పనులకోసం మంత్రిని కలిసిన సర్వసమాజ్ కార్యవర్గం



వినతిపత్రం అందజేస్తున్న సర్వసమాజ్ కార్యవర్గం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్‌ను మరో 450 మీటర్లు పెంచాలని భీంగల్ సర్వసమాజ్ కార్యవర్గం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. భీంగల్ సెంట్రల్ లైటింగ్ చేపట్టినందకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మరికొంత దూరం పెంచాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, నీలం గంగాధర్, బొదిరె నర్సయ్య, నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు

ప్రయివేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు జీవో 01, 93ను అమలు చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నవతెలంగాణ-బోధన్

ప్రయివేట్, కార్పోరేట్ విద్యా సంస్థలు జీఓ నెం.01,93 లను అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ బోధన్ డివిజన్ కన్వీనర్ సాయి అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం దారుణమని అన్నారు. అదే విధంగా విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్య సంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మన ఊరు మన బడి పథకంలో అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కో - కన్వీనర్ ప్రశాంత్, సురేష్, వెంకటేష్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత



పరామర్శిస్తున్న సుల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన వంజరి రాజుకు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల అనారోగ్యం పాలైన రాజు పక్షవాతం బారిన పడ్డాడు. రాజు కాళ్ళు, చేతులు అచేతన స్థితికి వెళ్ళాయి. విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం బాధితుడిని పరామర్శించి ధైర్యాన్ని కల్పించారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల కొరకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు పాలెపు నర్సయ్య, నల్ల గణేష్ గుప్తా, సింగిరెడ్డి శేఖర్, తదితరులు ఉన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని బీరప్పకు పూజలు

నవతెలంగాణ-బోధన్

వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఆదివారం బోధన్ మండలం కొప్పర్గ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో వారి కులదైవం బీరప్పకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సక్రమంగా కురియక రైతులు పంటలు వేసుకోవడం లేదని వర్షాలు అధికంగా కురిసి పాడి, పంటలతో విలసిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.